సాక్షి
జయశంకర్ భూపాలపల్లి
గురువారం । 18 । మే । 2023



డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు వాయిదా

కేయూ పరిధిలో జరుగనున్న 4, 6వ సెమిస్టర్ పరీక్షలు వాయిదా వేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి మల్లారెడ్డి తెలిపారు.

- 8లో



గవర్నర్‌కు ఘనస్వాగతం

ఖమ్మం నుంచి రోడ్డు మార్గంలో డోర్నకల్ రైల్వే స్టేషన్‌కు చేరుకున్న గవర్నర్ తమిళిసై సౌందర రాజన్‌కు బుధవారం కలెక్టర్, ఎస్పీ, అధికారులు ఘనస్వాగతం పలికారు.

- 8లో

గరిష్టం/కనిష్టం
$43.0^0/25.0^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది. మధ్యాహ్నం వడ గాలులు వీస్తాయి. రాత్రి సమయంలో ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ప్రశాంతంగా పాలిసెట్

భూపాలపల్లి అర్బన్: జిల్లా కేంద్రంలో బుధవారం నిర్వహించిన పాలిసెట్–2023 ప్రశాంతంగా ముగిసినట్లు పాలిసెట్ రీజినల్ కో ఆర్డినేటర్, స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శ్యాం ప్రసాద్ తెలిపారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన నాలుగు పరీక్ష కేంద్రాల్లో 1088 మంది విద్యార్థులకు గాను 1023 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. ఈ పరీక్షకు ప్రత్యేక అధికారులుగా హాజరైన నటరాజశేఖర్, సుధాకర్ నాయక్, కిషన్ రావులు హాజరై తనిఖీలు చేశారు.

'దిట్టం' కోసం ప్రపోజల్స్

కాళేశ్వరం: మహదేవపూర్ మండల పరిధిలోని కాళేశ్వరంలో గల శ్రీకాళేశ్వరముక్తీశ్వరస్వామి ఆలయం, అనుబంధ దేవాలయాల్లో దూప, దీప నైవేద్యం, అన్నదానం, మహా శివరాత్రి ఉత్సవాలు, ముఖ్య పండుగలకు వినియోగించే సామగ్రి(దిట్టం) కోసం ప్రపోజల్స్ దేవాదాయశాఖ అధికారులకు పంపించినట్లు ఈఓ మహేష్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 10 సంవత్సరాలను పరిగణలోకి తీసుకొని నిర్వహిస్తున్న విధంగా ఆలయ సాంప్రదాయాలకు అనుగుణంగా దేవాదాయశాఖ చట్టం ప్రకారం 30/87/యూ/ఎస్ 25 ప్రకారం రాబోయే 3 సంవత్సరాలకు అర్చకుల ఆమోదంతో దిట్టం ప్రపోజల్స్ తయారు చేసినట్లు వివరించారు. దిట్టం ప్రపోజల్స్ ఆమోదం పొందిన అనంతరం దేవాదాయ శాఖ సమర్పించనున్నట్లు పేర్కొన్నారు. ఈ విషయంలో ఎవరైనా సలహాలు, ఫిర్యాదులు చేయడానికి దిట్టం ప్రపోజల్స్‌ను పరిశీలించి 30 రోజుల లోపు ఈఓ కార్యాలయంలో లిఖిత పూర్వకంగా సమర్పించాలని సూచించారు.

సింగరేణి డైరెక్టర్‌కు వినతి



భూపాలపల్లి: సింగరేణి ఓపెన్‌కాస్ట్ భూ నిర్వాసితులకు వెంటనే నష్ట పరిహారం అందించాలని కోరుతూ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బుర్ర రమేష్, భూనిర్వాసితులు బుధవారం సింగరేణి డైరెక్టర్(ఆపరేషన్స్) శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు. స్థానిక జీఎం కార్యాలయంలో డైరెక్టర్‌ను కలిసి తమ డిమాండ్లను తెలియజేశారు. భూపాలపల్లి ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్ట్ 2 ఏర్పాటుతో తమ పంట పొలాలు పూర్తిగా దెబ్బతిన్నాయని, సమీప ఇళ్లు పగుళ్ల భారిన పడుతున్నాయని తెలిపారు. కాలుష్యంతో రోగాల భారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే నష్ట పరిహారం అందించాలన్నారు. లేని పక్షంలో ప్రాజెక్టు పనులను అడ్డుకుంటామని వారు హెచ్చరించారు. వినతిపత్రం అందించిన వారిలో బీఆర్ఎస్ నాయకులు, భూనిర్వాసితులు కోల రాజమల్లు, యాకుబ్ తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ బ్రాంచ్ కార్యదర్శిగా రాజయ్య



కంపేటి రాజయ్య

భూపాలపల్లి అర్బన్: సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) బ్రాంచ్ కార్యదర్శిగా కంపేటి రాజయ్య నియమితులయ్యారు. జిల్లా కేంద్రంలోని శ్రామిక భవన్‌లో బుధవారం నిర్వహించిన జనరల్ బాడీ సమావేశంలో సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్(సీఐటీయూ) నూతన బ్రాంచ్ కమిటీని ఎన్నుకున్నారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింహారావు మాట్లాడుతూ.. కార్మిక వర్గానికి అనుక్షణం వెన్నంటి ఉంటూ పలు విషయాలపైన అవగాహన కల్పిస్తూ ముందుకు పోతున్నామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై కార్మిక వర్గానికి పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తూ అన్ని యూనియన్లను ఏకతాటిపైకి తీసుకువచ్చి ఐక్య పోరాటాలను నిర్మిస్తున్నామని తెలిపారు. అందులో భాగంగానే రేపు కోల్‌కత్తాలో జరిగే వేజ్ బోర్డులో అన్ని సంఘాలను కలుపుకొని ఐక్యంగా యాజమాన్యంపై ఒత్తిడి తెచ్చి వేతన ఒప్పందాన్ని పరిష్కరించేందుకు ప్రయత్నం చేసేలా సీఐటీయూ పాత్ర ఉంటుందని తెలిపారు. సింగరేణిలో సీఐటీయూ చేస్తున్న కృషిని కార్మికులు గ్రహిస్తున్నారని ఫలితంగా పెద్ద ఎత్తున ఆదరణ కార్మికుల్లో వస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన కొత్తగా ఎన్నికైన కార్యవర్గాన్ని ప్రకటించారు. అధ్యక్షులుగా తొగరి శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా ఏసుబాబు, వంగాల రామస్వామి, బ్రాంచ్ కమిటీ సభ్యులుగా కించ రాము, గురువయ్య, లక్ష్మణ్, రాములు ఎన్నికయ్యారు.

సుర్రుమంటున్న సూరీడు

రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

- జిల్లాలో 43 డిగ్రీల సెల్సియస్ నమోదు
- బయటకు వెళ్లేందుకు జంకుతున్న జనం
- జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు



ఎండ తీవ్రతకు నిర్మానుష్యంగా మారిన భూపాలపల్లి అంబేడ్కర్ చౌరస్తా

భూపాలపల్లి: వారం రోజుల క్రితం వరకు వర్షాలతో చల్లబడిన వాతావరణం ఇప్పుడు ఒక్కసారిగా వేడెక్కడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పెరుగుతుండటం, వడగాలులు తీవ్రంగా వీస్తుండటంతో ప్రజలు వడదెబ్బ భారిన పడుతున్నారు. దీంతో వివిధ పనుల నిమిత్తం బయటకు వెళ్లేందుకు ప్రజలు జంకుతున్నారు. ఉదయం, సాయంత్రం సమయాల్లోనే తమ పనులను ముగించుకొని ఇంటికే పరిమితం అవుతున్నారు.

అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు..

జిల్లాలో గడిచిన ఐదు రోజులుగా అధిక ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. మంగళ, బుధవారాల్లో 42, 43 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. దీంతో రైతులు, పిల్లలు, వ్యవసాయ, నిర్మాణ రంగ కూలీలు, రోడ్లపై ఉండే చిరు వ్యాపారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. కార్మికులు, ఇతర రంగాల వారు భానుడు చల్లబడ్డాక ఉదయం, సాయంత్రం సమయంలోనే బయటకు వచ్చి తమ పనులు చూసుకుంటున్నారు. మధ్యాహ్నం అంతా ఇంట్లోనే ఫ్యాన్లు, కూలర్లు, ఏసీల కింద సేద తీరుతున్నారు. సింగరేణి సంస్థ ఓపెన్‌కాస్ట్‌లో పని చేసే కార్మికులకు ఎండ వేడిమి నేరుగా పడుతుండటంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో చేసేది లేక మొదటి, రెండో షిఫ్టు కార్మికుల్లో కొందరు గైర్హాజరు అవుతున్నారు.



అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు..

జిల్లాలో 43 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదు అవుతున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. వారం రోజులుగా ఎండ తీవ్రత, వడగాలులు ఎక్కువగా ఉన్నందున తగు జాగ్రత్తలు తీసుకోవాలని చెబుతున్నారు. మధ్యాహ్న వేళ ఎట్టి పరిస్థితుల్లో బయటకు రాకూడదని, వడదెబ్బ తగలకుండా చూసుకోవాలని చెబుతున్నారు.

జిల్లాలో ఐదు రోజులుగా నమోదైన ఉష్ణోగ్రతలు

తేదీ	ఉష్ణోగ్రతలు
13	40
14	40
15	40
16	42
17	43

ఆటల సమయం మార్చుకోవాలి..



వేసవికాలం నేపథ్యంలో ఎండలు విపరీతంగా ఉన్నాయి. పిల్లలు ఉదయం 9 గంటలు దాటిన తరువాత బయటకు రాకుండా ఇళ్లలోనే ఉండాలి. ఎక్కువగా చల్లటి నీటిని తాగకూడదు. జంక్‌ఫుడ్, ఆయిల్‌కు సంబంధించిన ఆహార పదార్థాలకు దూరంగా ఉండాలి. తల్లిదండ్రులు తమ పిల్లల పట్ల జాగ్రత్తగా ఉండాలి. మధ్యాహ్నం సమయంలో ఈత కొట్టరాదు. పిల్లలకు కొబ్బరి బోండాలు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు తాగించాలి. రసాయనాలతో తయారు చేసిన శీతల పానీయాలను తాగించొద్దు. ఎండలో వెళ్లి వచ్చాక నీరసం అనిపిస్తే గోరు వెచ్చని నీటిలో ఓఆర్ఎస్ ద్రావణం కలిపి తాగించాలి.

– జీడి తిరుపతి, పిల్లల వైద్య నిపుణులు, ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్

ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి



గర్భిణులు ఎండాకాలంలో ఎక్కువగా ప్రయాణాలు చేయకూడదు. ఎండ సమయంలో ప్రయాణం చేస్తే నిరసించిపోయే ప్రమాదం ఉంటుంది. ఘన పదార్థాలను తగ్గించి ద్రవపదార్థాలను ప్రతీ రెండు గంటలకు ఒకసారి తీసుకోవడం ఉత్తమం. అధిక ఉష్ణోగ్రతలు ఉన్న సమయంలో బయటకి వెళ్లకపోవడం మంచిది. తప్పనిసరి పరిస్థితుల్లో ప్రయాణం చేయాల్సి వస్తే వాటర్, పండ్ల రసాలు, మజ్జిగ అందుబాటులో ఉంచుకోవాలి. బేకరీ, ఫాస్ట్‌ఫుడ్ పదార్థాలకు దూరంగా ఉండాలి. వడదెబ్బ తగిలినట్లు అయితే చల్లటి నీళ్లు తాగుతూ, పడుకొని విశ్రాంతి తీసుకోవాలి. ఎడమ వైపున ఎక్కువగా పడుకోవడం మంచిది.

– డాక్టర్ ప్రవళిక, గైనకాలజిస్ట్

డీహైడ్రేషన్‌కు గురికావొద్దు



ఎండలో ఎక్కువగా తిరగడం వల్ల డిహైడ్రేషన్‌కు గురై నీరసించబడిపోతారు. ప్రస్తుతం ఉష్ణోగ్రతలు 40 నుంచి 45 డిగ్రీలు ఉంటున్నందున మనిషి శరీరం ఈ వేడిని తట్టుకోలేకపోతుంది. మన శరీరం 35 డిగ్రీల లోపు మాత్రమే వేడిని తట్టుకుంటుంది. పెరిగిన ఉష్ణోగ్రతతో ఎండలో ఉండటం వల్ల శరీరంలో నీటి శాతం తగ్గిపోతుంది. దీంతో చర్మం పొడిబారి నాలుక ఆరిపోవడం, వాంతులు, విరోచనాలు, జ్వరం రావడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఐదేళ్లలోపు పిల్లలు, గర్భిణులు, 60 ఏళ్ల పైబడిన వారు ఇంటికే పరిమితం కావాలి. వడదెబ్బకు గురైన వారిని వెంటనే నీడకు చేర్చి చల్లగా ఉండే పలుచని దుస్తులను వేయాలి. తడి గుడ్డతో తుడవాలి. చల్లటి నీళ్లు తాగించాక, తీవ్రత ఎక్కువగా ఉంటే డాక్టర్ వద్దకు తీసుకువెళ్లాలి. ప్రతీ ఒక్కరు 5 లీటర్లకు మించి నీటిని తాగాలి. లూజుగా ఉండే కాటన్ దుస్తులను ధరిస్తే మంచిది.

– డాక్టర్ విద్యాసాగర్, జనరల్ ఫిజిషియన్, జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి

జాగ్రత్తలు పాటించాలి



పశువులు, గొర్రెలు, మేకలను ఉదయం, సాయంత్రం పూట మాత్రమే మేతకు బయటకు వదలాలి. పశువుల షెడ్ పై కప్పు రేకులు ఉంటే 8 సెంటిమీటర్లతో గడ్డిని పరిచి, రోజుకు మూడు సార్లు నీటితో తడపాలి. షెడ్ లోపలికి గాలి, వెలుతురు అందేలా చూడాలి. అవసరమైతే ఫ్యాన్‌లు ఏర్పాటు చేయాలి. మేతను ముక్కలు ముక్కలుగా కట్ చేసి ఇవ్వాలి. వేసవిలో జీర్ణ క్రియ తగ్గుతుంది, దీంతో గంజి, జావాలాంటి పదార్థాలు అందించాలి. వడదెబ్బ తగిలితే వెంటనే వైద్యులను సంప్రదించాలి. పక్షులు, కోళ్లకు వడదెబ్బ తగలకుండా షెడ్లపై స్ప్రింకర్లు, షెడ్డులో ఫాగర్స్ ఏర్పాటు చేయాలి. కుక్కలకు చల్లని నీటితో స్ప్రే చేయాలి.

– డాక్టర్ రంగారావు, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి



నిర్మానుష్యంగా కాళేశ్వరం అంతర్రాష్ట్ర వంతెన

ఇన్‌కం ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్‌గా భగవాన్‌రెడ్డి



కాళేశ్వరం: మహదేవపూర్ మండల పరిధిలోని కాళేశ్వరం గ్రామానికి చెందిన శనిగరం భగవాన్‌రెడ్డి సెంట్రల్ గ్రూప్ స్థాయి ఎస్ఎస్‌సీ సీజీఎల్(స్టాఫ్ సెలక్షన్ కమిషన్ కంబైన్డ్ (గ్రాడ్యుయేట్ లెవల్) పరీక్షలో ఇన్‌కం ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్‌గా ఉద్యోగం సాధించాడు. ఆయన మార్చి 7న ఎస్ఎస్‌సీ సీజీఎల్ పరీక్ష రాయగా ఈ నెల 14న ఫలితాలు వెలుబడ్డాయి. అందులో ఆ యువకుడికి ఆలిండియా స్థాయిలో 1,480 ర్యాంకు వచ్చింది. ఇండియా స్థాయిలో మొత్తం ఈ పరీక్షకు 34.81లక్షల మంది అభ్యర్థులు హాజరైనట్లు తెలిపారు. త్వరలో బెంగుళూర్‌లో ఇన్‌కం ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్‌గా విధుల్లో చేరనున్నట్లు ఆయన తెలిపారు. దీంతో తల్లిదండ్రులు, గ్రామస్తులు అభినందనలు తెలుపుతున్నారు.

ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న అప్పయ్య

మంగపేట: ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డీఎంహెచ్‌ఓ అప్పయ్య అన్నారు. మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి పీహెచ్‌సీలో వైద్యాధికారి కారం నిఖిల్‌కుమార్, సిబ్బందితో బుధవారం రివ్యూ సమావేశాన్ని నిర్వహించారు. పీహెచ్‌సీలో వైద్య సేవలు ఎలా ఉన్నాయని పీహెచ్‌సీలో వైద్యం పొందుతున్న రోగులను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో ప్రజలకు అందే వైద్య సేవలపై వైద్యాధికారి సిబ్బందితో చర్చించారు. నేషనల్ ప్రోగ్రామ్స్ కార్యక్రమాలను నిర్వహిస్తు ప్రజలకు ఎప్పటికప్పుడు ఉచిత వైద్య సేవలు అందిస్తూ ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయాలని సూచించారు. డెలివరీలు, వ్యాక్సినేషన్‌తో పాటు ప్రస్తుత వేసవి ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున వడదెబ్బకు గురికాకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో హెల్త్ ఎడ్యుకేటర్ జయశ్రీ, ఏఎన్ఎం అరుణ, సోమలక్ష్మి, సీతారావమ్మ తదితరులు పాల్గొన్నారు.

బొగ్గు ఉత్పత్తి పెంచాలి



ఓపెన్‌కాస్టును పరిశీలిస్తున్న డైరెక్టర్

భూపాలపల్లి అర్బన్: భూపాలపల్లి ఏరియాలోని ఓపెన్‌కాస్ట్, అండర్‌గ్రౌండ్ గనుల్లో బొగ్గు ఉత్పత్తిని పెంచాలని సింగరేణి డైరెక్టర్(ఆపరేషన్స్) ఎస్‌వీకే శ్రీనివాస్ ఆదేశించారు. ఏరియాలోని బుధవారం పర్యటించిన ఆయన వివిధ గనుల్లో బొగ్గు ఉత్పత్తి, రవాణాపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ.. ఓపెన్‌కాస్ట్–3, కేటీకే 8వ గనుల్లో బొగ్గు ఉత్పత్తి తక్కువగా ఉందన్నారు. 8వ గనిలో శ్రీ ఆదిత్య కంపెనీ చేపడుతున్న బొగ్గు ఉత్పత్తి పనుల్లో పురోగతి లేదన్నారు. ఆశించిన స్థాయిలో బొగ్గును వెలికితీయడం లేదని అసంతృప్తిని వ్యక్తం చేశారు. రాబోయే వర్షాకాల వాతావరణానికి బొగ్గు ఉత్పత్తి, రవాణా ప్రక్రియలు ఆగకుండా సజావుగా సాగే విధంగా ముందస్తు ప్రణాళికలు వేయాలని ఆదేశించారు. ప్రమాదాల నివారణ రక్షణ చర్యలు అమలు చేయాలన్నారు. ఓసీ–2 మట్టి నుంచి ఇసుక తయారీలో జాప్యం చేయకుండా నిర్దేశించి లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేట్ జీఎం నరసింహారావు, ఏరియా జీఎం శ్రీనివాసరావు, అధికారులు రామలింగం, వెంకట్రామిరెడ్డి, రాజశేఖర్, తుకారాంలు పాల్గొన్నారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

జెడ్పీ సీఈఓ విజయలక్ష్మి



రాంనగర్‌లో చేస్తున్న పనులు పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ

చిట్యాల: మండల పరిధిలోని ప్రతీ గ్రామాన్ని ప్రజలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని జెడ్పీ సీఈఓ, మండల స్పెషల్ ఆఫీసర్ ఎల్. విజయలక్ష్మి కోరారు. ఈ సందర్భంగా బుధవారం ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని రాంనగర్ కాలనీలో చేస్తున్న పనులను ఆమె పరిశీలించారు. రోడ్డు వెంట చెత్తాచెదారం, పిచ్చి మొక్కలు లేకుండా పరిశుభ్రంగా ఉండే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. అలాగే లోతట్టు ప్రాంతాలను గుర్తించి నీరు నిల్వ లేకుండా మొరంతో నింపి చదును చేయాలన్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో చెత్త, ముళ్లపొదలు ఉంటే తొలగించాలన్నారు. రాంనగర్ కాలనీలో రోడ్డు వెంట ఉన్న డ్రెయినేజీలోని మురుగునీటిని తొలగించేలా చేశారు. మండల పరిధిలోని అధికారులు వారం రోజుల పాటు గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దావు వినోద, జెడ్పీటీసీ గొర్రె సాగర్, ఎంపీడీఓ వి.రామయ్య, ఎంపీఓ రామకృష్ణ, స్థానిక సర్పంచ్ పూర్ణచందర్ రావు, ఎంపీటీసీ కట్కూరి పద్మనరేందర్, పంచాయతీ కార్యదర్శి రవికుమార్, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

ములుగు రూరల్: అగ్ని ప్రమాదంలో చేతికి వచ్చిన పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలిని కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్‌గౌడ్ అన్నారు. మండల పరిధిలోని పందికుంటలో అగ్ని ప్రమాదం కారణంగా బుధవారం పంటలు నష్టపోయిన రైతులను పరామర్శించి మాట్లాడారు. ఆరుకాలం కష్టపడి పంటలు పండిస్తే చేతికి వచ్చిన సమయంలో ప్రమాదవశాత్తు పంటలు బుగ్గిపాలవడంతో రైతులు అప్పుల్లో కూరుకుపోయే ప్రమాదం ఉందన్నారు. వ్యవసాయ అధికారులు నష్టపోయిన పంటలను అంచనా వేసి ప్రభుత్వానికి నివేదికలు అందించాలని కోరారు. నష్టపోయిన ప్రతీ రైతుకు ఎకరాకు రూ.లక్ష పరిహారం అందించాలన్నారు. ప్రభుత్వం తీసుకువచ్చిన ధరణి పోర్టల్ కారణంగా రైతులకు పట్టాలు రాక, రుణాలు రాక అప్పుల్లో కూరుకుపోతున్నారని తెలిపారు. పంట నష్టాన్ని అంచనా వేయని పక్షంలో రైతులను కలుపుకొని ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బానోత్ రవిచందర్, నూనేటి శ్యాం, ఎంపీటీసీ సభ్యుడు మావురపు తిరుపతిరెడ్డి, నల్లెల్ల భరత్, బక్కయ్య, సమ్మయ్య పాల్గొన్నారు.

భూ నిర్వాసితులకు పరిహారం అందేలా చూడాలి

కలెక్టర్ భవేష్‌మిశ్రా



తహసీల్దార్లకు సూచనలు చేస్తున్న కలెక్టర్

భూపాలపల్లి: సింగరేణి, జెన్‌కో విస్తరణలో భాగంగా భూములు కోల్పోయిన భూ నిర్వాసితులకు పరిహారం అందించేలా చూడాలని కలెక్టర్ భవేష్ మిశ్రా అధికారులను ఆదేశించారు. జిల్లాలోని గణపురం, భూపాలపల్లి తహసీల్దార్ కార్యాలయాలను ఆయన బుధవారం సందర్శించి గణపురం మండలంలోని దుబ్బపల్లిలో జెన్‌కో, భూపాలపల్లి మండలం గడ్డిగానిపల్లిలో సింగరేణి సేకరించనున్న భూములు, లబ్ధిదారుల ఎంపికపై తహసీల్దార్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూనిర్వాసితులకు అన్యాయం జరగకుండా తగిన పరిహారం అందించేందుకు కృషి చేయాలని సూచించారు. ఆయా కార్యక్రమాల్లో గణపురం తహసీల్దార్ సతీష్, భూపాలపల్లి తహసీల్దార్ ఎండీ ఇక్బాల్ పాల్గొన్నారు.

మిల్లెట్ వృద్ధికి సహకారాలు అందిస్తాం..

మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్‌ను వృద్ధిలోకి తీసుకరావడానికి కావాల్సిన సహాయ సహకారాలు అందిస్తామని, భూపాలపల్లి జిల్లాను దేశ వ్యాప్తంగా చెప్పుకునేలా ఈ యూనిట్ నెలకొల్పే విధంగా కృషి చేయాలని కలెక్టర్ భవేష్ మిశ్రా సూచించారు. గణపురం మండల పరిధిలోని చెల్పూరు గ్రామ సమీపంలో రూ. 50 లక్షల వ్యయంతో నిర్మించిన మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్ అభివృద్ధిపై సంబంధిత అధికారులు, మహిళా సంఘాలతో బుధవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ టీఎస్ దివాకర, సీపీవో శామ్యూల్, డీఆర్‌డీఓ పురుషోత్తం, డీడబ్ల్యూవో శైలజ, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు పూర్తిచేయాలి

ములుగు: పెండింగ్‌లో ఉన్న రోడ్డు మరమ్మతు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ కృష్ణ ఆదిత్య అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఐటీడీఏ పీఓ అంకిత్, అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) ఇలా త్రిపాఠి, ఎస్పీ గాష్‌ఆలం, డీఎఫ్ఓ రాహుల్‌తో కలిసి ఇంజనీరింగ్ శాఖల అధికారులతో బుధవారం సమీక్ష సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ, ట్రైబల్ వెల్ఫేర్, ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్ శాఖలకు మంజూరైన పనులను ఈ నెల ఆఖరి వరకు పూర్తి చేయాలన్నారు. ఇప్పటి వరకు తుదిదశకు చేరుకున్న పనుల విషయంలో ఆలస్యం జరగకుండా చూడాలన్నారు. ఏజెన్సీ గ్రామాల్లో రోడ్డు మరమ్మతు పనుల్లో వేగం పెంచాలన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

జిల్లా వ్యవసాయాధికారి విజయ్‌భాస్కర్



ఎరువుల నిల్వను పరిశీలిస్తున్న విజయ్‌భాస్కర్

గణపురం: వ్యాపారులు ప్రభుత్వం గుర్తించిన విత్తనాలు మాత్రమే విక్రయించాలని రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే చట్ట పరంగా కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయాధికారి విజయ్‌భాస్కర్ హెచ్చరించారు. మండల పరిధిలోని పలు ఎరువుల దుకాణాల్లో మండల వ్యవసాయాధికారి అయిలయ్యతో కలిసి ఆయన బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు దుకాణాల్లో నిల్వ ఉన్న ఎరువులు, మందులను ఆయన పరిశీలించి మాట్లాడారు. రైతులు లైసెన్స్ ఉన్న డీలర్స్ దగ్గర మాత్రమే విత్తనాలు కొనుగోలు చేసి తప్పకుండా రశీదు పొందాలని సూచించారు. పత్తి విత్తనాలు విడిగా కొనుగోలు చేయవద్దని సూచించారు. వ్యాపారులు దుకాణాల ముందు తప్పకుండా ధరల పట్టిక, విత్తనాల లభ్యత వివరాలను తప్పక ఏర్పాటు చేయాలని తెలిపారు.

విప్లవ పార్టీలకు ఆకర్షితులు కావొద్దు

ఓఎస్డీ అశోక్‌కుమార్



విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ చేస్తున్న ఓఎస్డీ

ఎస్ఎస్‌తాడ్వాయి: యువత విప్లవ పార్టీలకు ఆకర్షితులు కావొద్దని, వారి వల్ల సమాజానికి ఒరిగిందేమీ లేదని ఓఎస్డీ అశోక్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని మారుమూల అటవీ ప్రాంతంలోని బంధాల గ్రామ పంచాయతీ పరిధిలోని పోచాపూర్, నర్సాపూర్, అల్లిగూడెం, బొల్లేపల్లి గ్రామాలను డీఎస్పీ రవీందర్, పస్రా సీఐ శంకర్, తాడ్వాయి ఎస్సై వెంకటేశ్వరరావులతో కలిసి ఓఎస్డీ అశోక్‌కుమార్ బుధవారం సందర్శించారు. ఆయా గ్రామాల్లో చదువుకుంటున్న విద్యార్థులకు నోట్ బుక్స్, పెన్నులు, చిన్నపిల్లలకు బిస్కెట్లను ఓఎస్డీ అందజేశారు. ఈ సందర్భంగా ఓఎస్డీ నర్సాపూర్ గ్రామస్తులతో మాట్లాడగా వారు పస్రా –లింగాల రోడ్డు నుంచి నర్సాపూర్ వరకు రోడ్డు సౌకర్యం, గ్రామంలో మిషన్ భగీరథ తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరగా పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం ఓఎస్డీ అశోక్‌కుమార్ మాట్లాడుతూ గ్రామంలో చదువుకున్న నిరుద్యోగుల లిస్ట్ తయారు చేసి వారి ఆసక్తిని బట్టి జాబ్‌మేళా నిర్వహించేందుకు ప్రయత్నం చేస్తామన్నారు. యువత అసాంఘిక శక్తులకు సహకరించవద్దని, గ్రామాల్లో ఎవరైనా కొత్త వ్యక్తులు, అనుమానితులు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. బడీడు పిల్లలందరిని బడికి పంపించాలని తల్లిదండ్రులకు సూచించారు. గ్రామీణ ప్రాంతంలోని క్రీడాకారులు క్రీడల్లో రాణించాలని స్పోర్ట్స్ మీట్ ఏర్పాటు చేసినప్పుడు సద్వినియోగం చేసుకోవాలన్నారు. యువత చెడు వ్యసనాలకు బానిసలు కావొద్దని చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. మారుమూల గ్రామాల్లో సమస్యలు ఉన్నా పోలీసులను సంప్రదించాలని సూచించారు. సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

క్లుప్తంగా

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్ష రాయమన్నందుకు ఆత్మహత్య


పెనక వివేక్ (ఫైల్)

ఎస్ఎస్‌తాడ్వాయి: ఇంటర్‌లో తప్పిన ఓ విద్యార్థిని సప్లిమెంటరీ పరీక్ష రాయమన్నందుకు మనస్తాపం చెంది ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి చనిపోయాడు. ఎస్సై వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. ములుగు జిల్లా ఎస్ఎస్ తాడ్వాయి మండలంలోని వీరపూర్ గ్రామానికి చెందిన పెనక వివేక్(17) ఇంటర్ ఫస్టియర్‌లో ఫెయిలయ్యాడు. ఇంటి వద్ద ఖాళీగా తిరుగుతున్న వివేక్‌ను తల్లిదండ్రులు ఫీజు చెల్లించి సప్లిమెంటరీ పరీక్ష రాయమని చెప్పడంతో మనస్తాపానికి గురైన విద్యార్థి మంగళవారం పురుగు ముందు తాగాడు. తల్లిదండ్రులు గమనించి చికిత్స కోసం వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ రాత్రి మృతిచెందాడు. బుధవారం తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఎండలో బైక్ భద్రం..

- భానుడి ప్రతాపం ఎక్కువ.. పార్కింగ్ స్థలాలు తక్కువ
- వాహనం ఎండలోపెట్టారో.. పెట్రోల్ హాంఫట్
- టైర్లు పేలడం.. ఇంజన్‌లో మంటలు, మైలేజ్ తగ్గే అవకాశం



వరంగల్‌లో రోడ్డు పక్కన ఎండలో పార్కింగ్ చేసిన ద్విచక్రవాహనాలు

ఖిలా వరంగల్: వేసవి కాలం భానుడి ప్రతాపం బెంబేలెత్తిస్తోంది. ఈ తరణంలో మనుషులే ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని తిరగాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ పరిస్థితి నుంచి ఉపశమనం పొందేందుకు మనం అనేక జాగ్రత్తలు తీసుకుంటున్నాం. అయితే మనంవాడే వాహనాల విషయంలో మాత్రం అంతగా శ్రద్ధ వహించం. వరంగల్ ఉమ్మడి జిల్లాతోపాటు నగర వ్యాప్తంగా ఎండలు ఎక్కువ.. పార్కింగ్ స్థలం తక్కువ కనిస్తున్నాయి. దీంతో ప్రధానంగా ద్విచక్రవాహనదారుల జేబులకు చిల్లులు పడుతున్నాయి. ఇంటి నుంచి ఆఫీసుకు, తిరిగి ఇంటికి వస్తుంటాము.. ఈక్రమంలో మధ్యలో అవసరం వస్తే.. ఏదైనా షాపు ఎదుట పార్కింగ్ చేసి మండుటెండలో బైకులను పార్కింగ్ చేస్తుంటాం. దీంతో ఇంధనం ఎక్కువ ఖర్చు అవుతుండటంతోపాటు తరచూ మరమ్మతులకు గురవుతుంది. దీంతోపాటు మైలేజ్ కూడా తగ్గిపోవడం, కలర్ షేడ్ కావడం, పెట్రోలు ఆవిరైపోవడం, ఇంజన్‌లో మంటలు చెలరేగడం వంటి సమస్యలు ఉంటాయని మెకానిక్‌లు హెచ్చరిస్తున్నారు. ప్రస్తుతం ఉష్ణోగ్రత 40 నుంచి 45 డిగ్రీలతో ఎండలు మండిపోతున్నాయి. ఈనేపథ్యంలో వేసవిలో వాహనానికి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలుసుకుందాం..

జాగ్రత్తలు ఇలా..

- వేసవిలో ఎండల వేడికి ఇంజన్ అయిల్ త్వరగా పలుచబడిపోతుంది. నిర్ణీత సమయానికి ఇంజనాయిల్‌ను మార్చుకోవడం మంచిది.
- వాహన పెట్రోలు ట్యాంకుపై మందం కవరు ఉండేలా చూసుకోవాలి.
- సీట్ల కవర్లు సాధారణమైనవైతే అవి వేడెక్కి మన ఆరోగ్యంపై ప్రభావం పడుతుంది.
- ఎండలో వాహనాలు ఎక్కువ సమయం పార్కింగ్ చేయొద్దు.
- ఎండలో దూరప్రయాణం చేయాల్సిన వారు మధ్యలో కాసేపు వాహనాన్ని ఆపాలి.
- వాహనాలను ఎక్కువ సేపు పార్కింగ్ చేయాల్సి వస్తే నీడలోనే ఉంచాలి.

జాగ్రత్తలతోనే ప్రమాదాల నివారణ



వేసవి కాలంలో టైర్లు, ఇంజన్ కండిషన్ చెక్‌చేసుకోవాలి. వాహనాలపై దూరప్రయాణం చేయొద్దు. ఎండ వేడితో ఇంజన్‌లో మంటలు వచ్చే ప్రమాదం ఉంది. ఉదయం 5గంటల నుంచి 10గంటల లోపు.. సాయంత్రం 4గంటల నుంచి రాత్రి 8 గంటల లోపు ప్రయాణం చేయాలి. రహదారులపై వాహనచోదకులు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం.

- రవీందర్, ఎంవీఐ వరంగల్

వాహనాలను నీడలోనే ఉంచాలి..



వేసవిలో వాహనాలను నీడలోనే పార్కింగ్ చేయాలి. దూర ప్రయాణాలు చేసే వారు ద్విచక్రవాహనాన్ని మధ్యలో ఆపాలి. ఇలా విశ్రాంతి తీసుకోవడం వల్ల బైక్ ఇంజన్ కూల్ ఆవుతుంది. టైర్లు, ట్యూబులు కండీషన్లో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. ఎండలో ఎక్కువగా వేగంగా వెళ్లడం వల్ల ప్రమాదం జరిగే అవకాశం ఉంటుంది. వాహనాల బ్రేకులను సక్రమంగా ఉండేలా చూసుకోవాలి.

- ఎండీ జాఫర్, సీనియర్ మెకానిక్ ఫోర్ట్‌రోడ్ వరంగల్

వాహన రంగు షేడ్ అవుతుంది



మండుటెండలో ద్విచక్రవాహనాలను పార్కింగ్ చేయడం వలన రంగు షేడ్ అవుతోంది. కంప్యూటరైజ్డ్ కెమికల్స్‌తో కూడిన పెయింటింగ్ వాడటం వలన వాటి రంగు త్వరగా పోతుంది. వేసవిలో పగలు కన్నా సాయంత్రం ద్విచక్రవాహనాల్లో పెట్రోలు పట్టించుకోవడం మంచిది. టైర్లో గాలి కొట్టించే విషయంలో ఆలసత్వం ప్రదర్శిస్తే టైర్ల మన్నిక తగ్గిపోతుంది.

- ఎండీ సాధిక్, లక్ష్మీపురం వరంగల్

గవర్నర్‌కు ఘనస్వాగతం..


గవర్నర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్పీ, కలెక్టర్


స్టేషన్‌లోకి వస్తున్న గవర్నర్

- డోర్నకల్‌లో స్వాగతం పలికిన కలెక్టర్, ఎస్పీ, అధికారులు
- వినతి పత్రాలు అందించిన స్థానికులు

డోర్నకల్: రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ బుధవారం ఖమ్మం నుంచి రోడ్డు మార్గంలో డోర్నకల్ రైల్వే స్టేషన్‌కు చేరుకుని మణుగూర్–బెలగావి ఎక్స్‌ప్రెస్ రైలు ప్రత్యేక బోగీలో సికింద్రాబాద్‌కు వెళ్లారు. గవర్నర్ వాహనం నేరుగా రెండో నంబర్ ప్లాట్‌ఫారం చివరకు చేరుకోగా కలెక్టర్ కె.శశాంక, ఎస్పీ శరత్‌చంద్ర, రైల్వే ఏడీఈఎన్ ప్రకార్‌సింగ్, ఆర్‌డీఓ కొమరయ్య తదితరులు గవర్నర్‌కు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. మొదట ఖమ్మం పర్యటన ముగించుకుని స్థానిక రైల్వే గెస్ట్ హౌస్‌కు వచ్చి అక్కడి నుంచి స్టేషన్‌కు వెళ్తారని భావించిన అధికారులు గెస్ట్‌హౌజ్‌లో గవర్నర్ కోసం ఎదురుచూశారు. కానీ, గవర్నర్ నేరుగా రైల్వే స్టేషన్ వస్తున్నారనే సమాచారంతో అధికారులు స్టేషన్‌కు చేరుకున్నారు. తనను కలిసేందుకు వచ్చిన అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానికులను చిరునవ్వుతో పలకరించి బోగీ ద్వారం వద్దకు చేరుకుని నమస్కారం చేసుకుంటూ వెళ్లిపోయారు. వాహనం దిగి రైలు బోగీలోకి వెళ్లడానికి మధ్య గవర్నర్ ఐదు నిమిషాలు మాత్రమే ప్లాట్‌ఫారంపై గడిపారు.

వినతుల స్వీకరణ..

ఆక్రమణకు గురైన ఎండోమెంట్ భూములను పరిరక్షించాలని, మెయిన్ రోడ్డు వెడల్పులో జరిగిన అవకతవకలపై విచారణ జరపాలని బీజేపీ నాయకులు కాపరబోయిన సత్యనారాయణ వినతిపత్రం అందించగా డోర్నకల్‌లో పలు రైళ్లకు హాల్టు కల్పించాలని అర్జున యూత్ ప్రతినిధి కొత్త రాంబాబు వినతిపత్రం అందించారు. ఉర్దూ మీడియం విద్యార్థులకు ఉర్దూ భాషలో ప్రశ్నాపత్రాలు ముద్రించాలని ఎన్‌జీఓ జిల్లా సభ్యుడు అఖిల్‌ఖాన్ కోరారు. రెడ్ క్రాస్ జిల్లా ప్రతినిధులు డాక్టర్ నెహ్రూ రాథోడ్, ప్రసాద్, వెంకటరెడ్డి గవర్నర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ స్వాతిబిందు, జిల్లా ఉద్యానశాఖ అధికారి సూర్యనారాయణ, ఎంపీడీఓ అపర్ణ, డీఎస్పీ రమణబాబు, సీఐ వెంకటరత్నం, స్టేషన్ సూపరింటెండెంట్ ప్రసాద్, ఆర్‌పీఎఫ్ సెక్యూరిటీ కమిషనర్ శ్రీనివాస్, ఎస్సై శ్రీనివాసరావు, జీఆర్‌పీ సీఐ వెంకటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీలో ఈ బస్సుల విస్తరణ

- కరీంనగర్ జోన్‌కు రానున్న 300 బస్సులు
- అదిలాబాద్ మినహా మిగతా రీజియన్‌లకు ప్రథమ ప్రాధాన్యం


అధికారులతో సమావేశమైన ఆర్టీసీ చీఫ్ ఆపరేషన్స్ ఆఫీసర్ రవీందర్

హన్మకొండ: నేషనల్ ఎలక్ట్రిక్ బస్ ప్రోగ్రాంలో భాగంగా రాష్ట్రంలోని అన్ని రీజియన్‌లో ఈ బస్సులను విస్తరించేందుకు యాజమాన్యం సంకల్పించింది. ఈ క్రమంలో ఆర్టీసీ కరీంనగర్ జోన్‌లోనూ ఈ బస్సులను ప్రవేశ పెట్టేందుకు యాజమాన్యం చర్యలకు పూనుకుంది. ఈ బస్సులు ప్రవేశ పెట్టేందుకు ఏఏ డిపోలు అనువుగా ఉంటాయో గుర్తించే పనిలో యాజమాన్యం, అధికారులు నిమగ్నమయ్యారు. ఈ మేరకు బుధవారం హనుమకొండలోని ఆర్టీసీ వరంగల్ రీజియన్ కార్యాలయంలో చీఫ్ ఆపరేషన్స్ ఆఫీసర్ వి.రవీందర్ అధ్యక్షతన సమావేశమయ్యారు. ఆర్టీసీ ఈడీ ఆపరేషన్, సంస్థ కార్యదర్శి మునిశేఖర్, కరీంనగర్ జోన్ ఈడీ వి.వెంకటేశ్వర్లు, చీఫ్ మెకానికల్ ఇంజనీర్ టి.రఘునాథరావు, చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ పి.జీవన్ ప్రసాద్, వరంగల్ రీజినల్ మేనేజర్ జే.శ్రీలత, కరీంనగర్ ఆర్ఎం డి.సుచరిత, ఖమ్మం ఆర్ఎం ప్రభులత, నిజామాబాద్ ఆర్ఎం టి.ఉషాదేవి, ఇతర అధికారులతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ముందుగా ఈ బస్సులపై రీజియన్ అధికారులకు అవగాహన కల్పించారు. ఈ బస్సుల వినియోగం, చార్జింగ్ స్టేషన్‌ల ఏర్పాటు, ఇతర సౌకర్యాల కల్పనపై రీజియన్ అధికారులకు చీఫ్ ఆపరేషన్స్ ఆఫీసర్ రవీందర్, ఈడీలు వివరించారు. ఈ మేరకు డిపోలు, రూట్‌లు గుర్తించాలని సూచించారు. రాష్ట్ర ఆర్టీసీకి మొత్తం 500 ఎలక్ట్రిక్ బస్సు (ఈ బస్సు)లు రానుండగా ఇందులో కరీంనగర్ జోన్‌కు దశలవారీగా 304 ఈ బస్సులు రానున్నాయి. ఈ బస్సులను కరీంనగర్ జోన్‌లోని అదిలాబాద్ రీజియన్ మినహా, కరీంనగర్, వరంగల్, ఖమ్మం, నిజామాబాద్ రీజియన్‌లో నడుపనున్నారు. ఈ బస్సులు ఒకసారి చార్జింగ్ అయితే 300 కిలో మీటర్ల మేరకు వెళ్లగలుగుతాయి. ఈ మేరకు రూట్లను గుర్తించాలని రీజియన్ అధికారులకు సూచించారు. ప్రధానంగా ప్రథమ ప్రాధాన్యం రీజియన్ హెడ్‌క్వార్టర్‌లోని డిపోలకు ఈ బస్సులు అలాట్ చేయాలనే ఆలోచనలో యాజమాన్యం ఉంది. ఈ మేరకు డిపోలను గుర్తించనున్నారు. ఈ డిపోలో చార్జింగ్ స్టేషన్ ఏర్పాటు, ఈ బస్సుల మరమ్మతులు, నిర్వహణ సాధ్యాసాధ్యాలను గుర్తించి డిపోలను ఎంపిక చేస్తారు. ఏడాదిన్నరలో ప్రతి రీజియన్‌కు 70 నుంచి 80 ఎలక్ట్రిక్ బస్సులు చేరుకుంటాయి. వచ్చే సెప్టెంబర్‌లో కొన్ని బస్సులు రానున్నాయి. వాతావరణ కాలుష్యాన్ని తగ్గించడంతో పాటు ఇంధన వ్యయాన్ని తగ్గించేందుకు టీఎస్ ఆర్టీసీ ఈ బస్సులను ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. ఈ బస్సులకు ప్రయాణీకులకు కాలుష్యరహిత, సురక్షిత, సుఖవంత, మెరుగైన ప్రయాణ అనుభూతి అందించడమే లక్ష్యంగా ఈ బస్సులను ప్రవేశ పెడుతున్నటు ఆర్టీసీ చీఫ్ ఆపరేషన్స్ ఆఫీసర్ రవీందర్ తెలిపారు. ఈ సమావేశంలో వరంగల్ రీజియన్ డిప్యూటీ ఆర్ఎంలు బి.కృపాకర్ రెడ్డి, జి.మాధవరావు పాల్గొన్నారు.

సమయపాలన పాటిస్తూ.. పనిచేయండి

- ఉద్యోగుల సమావేశంలో వీసీ రమేష్


సమావేశంలో మాట్లాడుతున్న వీసీ రమేష్

కేయూ క్యాంపస్: విధి నిర్వహణలో సమయపాలన పాటిస్తూ.. కలిసికట్టుగా పనిచేయాలని కాకతీయ యూనివర్సిటీ వీసీ ఆచార్య తాటికొండ రమేష్ ఉద్యోగులను కోరారు. బుధవారం కాకతీయ యూనివర్సిటీలోని పరిపాలనా భవనం సెనెట్‌హాల్‌లో రెగ్యులర్ నాన్ టీచింగ్ ఉద్యోగులతోపాటు తాత్కాలిక ఉద్యోగులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. న్యాక్ టీం ఈనెల 25, 26, 27 తేదీల్లో పర్యటించి విభాగాలను పరిశీలించనుందని తెలిపారు. కావున ప్రతి ఉద్యోగి పూర్తిస్థాయిలో సన్నద్ధతతో పనిచేయాలని కోరారు. యూనివర్సిటీ ప్రతి ఒక్క ఉద్యోగికి సంబంధించినదన్నారు. న్యాక్ ఏ గ్రేడ్‌ను సాధించుకునేలా సమష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. మంచి గ్రేడ్ వస్తేనే యూనివర్సిటీకి ప్రయోజనం కలగుతుందన్నారు. ఉద్యోగుల సమస్యలు తెలుసని, తప్పకుండా పరిష్కరించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రధానంగా తాత్కాలిక ఉద్యోగులకు వేతనాల పెంపుదల, 2013 బ్యాచ్ రెగ్యులర్ ఉద్యోగులకు సంబంధించి నిలిచిపోయిన పీఆర్‌సీ ఇప్పించేందుకు కృషిచేస్తానని తెలిపారు. జూన్ 2వ తేదీ వరకు ఆయా సమస్యల పరిష్కారం చేసేలా కృషి జరుగుతుందన్నారు. ఐక్యూ ఏసీ డైరెక్టర్ ఆచార్య నర్సింహాచారి మాట్లాడుతూ న్యాక్ టీం రానున్న నేపథ్యంలో వివిధ విభాగాలను సందర్శించి పరిశీలిస్తున్నామని అయితే పలుచోట్ల విధుల నిర్వహణలో ఉండాల్సిన వారు ఉండటం లేదన్నారు. అంతేగాకుండా ఉద్యోగుల కొరత ఉందని చెబుతున్నారన్నారు. యూనివర్సిటీలో 500 మందికిపైగా అన్నిరకాల ఉద్యోగులు ఉంటారన్నారు. మంచి గ్రేడ్ సాధించాలంటే ఉద్యోగుల పాత్ర కీలకమని స్పష్టం చేశారు. కేయూ రిజిస్ట్రార్ శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ ఉద్యోగుల పలు సమస్యల పరిష్కారానికి వీసీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి కృషి చేస్తున్నారని తెలిపారు.

ఉమ్మడి జిల్లాలో వడదెబ్బతో నలుగురి మృతి


ప్రియాంక (ఫైల్)

సంగెం: వరంగల్ జిల్లా సంగెం మండంలోని గవిచర్ల గ్రామంలో ఓ వివాహిత వడదెబ్బతో మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గవిచర్ల గ్రామానికి చెందిన పాపాని ప్రియాంక(28) ప్రతి రోజూ వ్యవసాయ కూలీ పనులకు వెళ్తుంది. మంగళవారం సాయంత్రం కూలీ పనికి వెళ్లగా ఎండ వేడిమితో వడదెబ్బకు గురై అస్వస్థతతో సొమ్మసిల్లి పడిపోయింది. వాంతులు, విరేచనాలయ్యాయి, గమనించిన తోటి కూలీలు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఇంటికి తీసుకొచ్చిన తర్వాత ప్రియాంక పరిస్థితి విషమించడంతో వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలిస్తుండగా మంగళవారం రాత్రి మృతి చెందింది. మృతురాలికి భర్త వెంకటేశ్వర్లు, 13 నెలల కూతురు రిత్విక ఉంది. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సర్పంచ్ దొనికెల రమ కోరారు.

బయ్యారంలో కూలీ..


సీతారాం(ఫైల్)

బయ్యారం: మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలంలో ఓ వ్యవసాయ కూలీ వడదెబ్బతో మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కోడిపుంజులతండాకు చెందిన ఇస్లావత్ సీతారాం(55) మామిడితోటలో కాపలా కూలీగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం తోటకాపలా ఉన్న సమయంలో అస్వస్థతకు గురై మృతి చెందాడు.

మానుకోటలో రిక్షావాలా..


రాంజీ(ఫైల్)

మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని బాబా గుట్ట కాలనీకి చెందిన బానోత్ రాంజీ (52) ఎండల తీవ్రత కారణంగా వడదెబ్బకు గురై మంగళవారం రాత్రి మృతిచెందాడు. రాంజీ రోజు మాదిరిగానే మంగళవారం ఉదయం రిక్షా తొక్కుతూ సిమెంట్ బస్తాలు, సిమెంట్ తొట్లు ప్రజలకు చేరవేసి సాయంత్రం ఇంటికి వెళ్లాడు. కొంత సేపటికి అస్వస్థతకు గురయ్యాడు. ఏమి కాదులే అదే తగ్గిపోతుందని కుటుంబ సభ్యులకు చెప్పి అలాగే ఊరుకున్నాడు. నిద్రలోనే రాంజీ మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

గుర్తూరులో మత్స్యకారుడు..

తొర్రూరు రూరల్: వడదెబ్బకు గురై ఓ మత్స్య కార్మికుడు మృతి చెందిన సంఘటన మండలంలోని గుర్తూరు గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన పెసరి రాజు(30) అనే మత్స్యకార్మికుడు చేపల వేటకు గుర్తూరు చెరువులోకి వెళ్లి తీవ్ర ఎండకు అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే కుటుంబ సభ్యులు తొర్రూరులోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు.

ఉష్ణోగ్రతలపై అప్రమత్తంగా ఉండాలి

హన్మకొండ: వేసవి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నందున అధికారులు, ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలని టీఎస్ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అన్నమనేని గోపాల్ రావు సూచించారు. బుధవారం హనుమకొండ నక్కలగుట్టలోని క్యాంపు కార్యాలయం నుంచి కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల జిల్లా ఎస్ఈలు, డీఈలు, ఎస్ఏఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలు, డివిజన్‌లు, విభాగాల వారీగా ప్రగతిని, విద్యుత్ అంతరాయాలపై సమీక్షించారు. తరచూ విద్యుత్ అంతరాయాలు ఏర్పడడంపై అసహనం వ్యక్తం చేశారు. ఉష్ణోగ్రతలు పెరగడంతో విద్యుత్ వినియోగం పెరగడం వల్ల ట్రాన్స్‌ఫార్మర్‌లపై భారం పడుతుందని, అధికారులు, ఉద్యోగులు పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని ఆదేశించారు. రాత్రి సమయంలో షిఫ్ట్ పద్ధతిలో పని చేస్తూ ఫ్యూజ్ ఆఫ్ కాల్స్‌ను అటెండ్ చేయాలని తెలిపారు. డైరెక్టర్లు గణపతి, సంధ్యారాణి, మోహన్ రెడ్డి, తిరుపతిరెడ్డి, డీఈ ఐటీ అనిల్ కుమార్, సీజీఎంలు, ఎస్ఈలు, డీఈలు పాల్గొన్నారు.

ఖోఖో క్రీడను ప్రోత్సహించాలి

- తెలంగాణ ఖోఖో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జంగా రాఘవరెడ్డి
- వాగ్దేవిలో ఖోఖో అంతర్జాతీయ న్యాయ నిర్ణేతల వర్క్‌షాపు ప్రారంభం


మాట్లాడుతున్న జంగా రాఘవరెడ్డి

మామునూరు: గ్రామీణ స్థాయి నుంచే బాలబాలికల్లో దాగి ఉన్న క్రీడానైపుణ్యాలను వెలికితీసి ఖోఖో క్రీడను మరింతగా ప్రోత్సహించాలని ఖోఖో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యదర్శి ఎం.ఎస్.త్యాగి, తెలంగాణ ఖోఖో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జంగా రాఘవరెడ్డి సూచించారు. ఈమేరకు బుధవారం ఖిలా వరంగల్ మండలం బొల్లికుంట వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాలలోని ఆడిటోరియంలో ఉమ్మడి వరంగల్ జిల్లా ఒలంపిక్ సంఘం అజీజ్ ఖాన్, కార్యదర్శి కైలాస్ యాదవ్, ఖోఖో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో 16 నుంచి18వ తేదీ వరకు మూడు రోజులపాటు నిర్వహించనున్న ఖోఖో అంతర్జాతీయ న్యాయ నిర్ణేతల వర్క్‌షాపు బుధవారం ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా వారు హాజరై శ్రీలంక, మలేషియా ఖో, ప్రతినిధులతో కలిసి వర్క్‌షాపును ప్రారంభించి, మాట్లాడారు. క్రీడాపోటీల నిర్వహణలో న్యాయ నిర్ణేతల పాత్ర అత్యంత కీలకమని చెప్పారు. కాలానికి అనుగుణంగా న్యాయ నిర్ణేతలు తమ పనితీరుని మెరుగు పర్చుకోవాలని సూచించారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో సెమినార్లు నిర్వహించి ఖోఖో క్రీడ విశిష్టతను తెలియజేయాలని పేర్కొన్నారు. అనంతరం ఉమ్మడి వరంగల్ జిల్లా ఒలంపిక్ సంఘం, ఖోఖో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా కార్యవర్గ ప్రతినిధులు జగరాఘవరెడ్డితోపాటు శ్రీలంక, మలేషియా ప్రతినిధులను సత్కరించారు. ఈ వర్క్‌షాపులో పలు రాష్ట్రాలు, మలేషియా, శ్రీలంక ప్రతినిధులు ఆతుల్లా వాదేకరణే, రుద్రరజణే, పురుషోత్తం, కుమార్‌వాలే, డీవైఎఫ్ హనుమకొండ క్రీడాఅధికారి గుగులోతు ఆశోక్‌కుమార్, కార్పొరేటర్లు జక్కుల రవీందర్ యాదవ్, విజయ రజవలి, ఆర్గనైజింగ్ సెక్రటరీ కృష్ణమూర్తి, తోట శ్యాం ప్రసాద్, విజయ్‌కుమార్, సీతారామ్‌రెడ్డి పాల్గొన్నారు.

వివాహిత బలవన్మరణం


మౌనిక(ఫైల్)

నర్సింహులపేట: అదనపు కట్నం కోసం భర్త, అత్తమామల వేధింపులతో వివాహిత భూక్యా మౌనిక(28) ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని పకీర తండాలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్సై మంగీలాల్ కథనం ప్రకారం.. మానుకోట జిల్లా నర్సింహులపేట మండలం పకీరతండాకు చెందిన భూక్యా వెంకన్న, బుల్లిల కుమారుడు రాంబాబుతో 11 సంవత్సరాల క్రితం బయ్యారం మండలంలోని చోక్లాతండాకు చెందిన తేజావత్ హుస్సేన్ కుమార్తె మౌనికకు వివాహం జరిగింది. ఈక్రమంలో అదనపు కట్నం తేవాలని భర్త, అత్త, మామ వేధించడంతో ఇంట్లోనే మౌనిక పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. మౌనికకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతురాలి తండ్రి తేజావత్ హుస్సేన్ ఫిర్యాదు మేరకు భర్త, అత్త, మామలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఇదిలా ఉండగా మృతురాలి తలపైన బలమైన గాయం కావడంతో రక్తస్రావం జరుగుతుందని, హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని బంధువులు ఆరోపిస్తున్నారు.

డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు వాయిదా

- ఎండల నేపథ్యంలో పలువురి విజ్ఞప్తి మేరకు నిర్ణయం
- జూన్ 13 నుంచి పరీక్షలు


పరీక్షలు వాయిదా వేయాలని వీసీ రమేష్‌ను కోరుతున్న లెక్చరర్లు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో జరగనున్న పలు సెమిస్టర్ పరీక్షలను వాయిదా వేశారు. ఉమ్మడి వరంగల్, ఖమ్మం, అదిలాబాద్ జిల్లాల్లో డిగ్రీ కోర్సుల బీఏ, బీకాం, బీబీఏ, బీఎస్సీ, బీ ఒకేషనల్, బీసీఏ, బీఏ(ఎల్) పీడీసీ కోర్సుల 4, 6వ సెమిస్టర్ పరీక్షలు వాయిదా వేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారులు డాక్టర్ మధుకర్, డాక్టర్ నరేందర్ బుధవారం వెల్లడించారు. తిరిగి జూన్ 13నుంచి పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కేయూ పరిధిలో డిగ్రీ 4వ, ఆరో సెమిస్టర్‌ల పరీక్షలు కీలకమైనవి. మే నెలలోనే నిర్వహించాలనే విధంగా రెండు మూడుసార్లు టైం టేబుల్ షెడ్యూల్స్‌ను విడుదల చేసిన పరీక్షల విభాగం అధికారులు వివిధ కారణాలతో ముఖ్యంగా వివిధ సెట్ల పరీక్షలు ఉండటంతో వాయిదా వేస్తూ వచ్చారు. చివరికి ఈనెల 22నుంచి పరీక్షలు నిర్వహిస్తామని టైం టేబుల్ విడుదల చేశారు. అయితే ఈషెడ్యూల్‌ను ప్రకటించాక ఈవేసవిలో ఎండలు మండిపోతున్నాయని తమకు ఇబ్బంది అని పరీక్షల విధులను నిర్వహించాల్సిన వివిధ డిగ్రీ కళాశాలల అధ్యాపకులు పరీక్షల విభాగం అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. హనమకొండ, వరంగల్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలలకు చెందిన పలువురు మహిళా అధ్యాపకులు బుధవారం వీసీ ఆచార్య తాటికొండ రమేష్, రిజిస్ట్రార్ ఆచార్య శ్రీనివాస్‌ను, పరీక్షల నియంత్రణాధికారి మల్లారెడ్డిని కలిసి డిగ్రీ పరీక్షలు వాయిదా వేయాలని విన్నవించారు. వీరికి మద్దతుగా ఏబీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మంద నరేష్ ఉన్నారు. ఎండవేడిమి ఎక్కువ ఉందని దీంతో అధ్యాపకులతోపాటు విద్యార్థులకు ఇబ్బంది అని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో చివరికి వాయిదావేస్తూ రీ షెడ్యూల్ చేశారు.

ఆలస్యమైతే ఫలితాలపై ప్రభావం

డిగ్రీ కోర్సుల విద్యార్థులకు 6వ సెమిస్టర్ పరీక్షలు కీలకమైనవి. ఈ పరీక్షలు మే–జూన్‌లో పూర్తియితేనే ఫలితాలు సకాలంలో వచ్చే అవకాశం ఉంటుంది. ఇప్పుడు జూన్–జూలైలో జరగబోతున్నందున ఫలితాలపై ప్రభావం చూపనుందని భావిస్తున్నారు. ఎందుకంటే డిగ్రీ కోర్సుల 6వ సెమిస్టర్ పరీక్షలతో కోర్సు పూర్తయితే ఉన్నత విద్య ఇతర కోర్సుల్లోకి ప్రవేశాలకు అవకాశం కలుగుతుంది. ఉన్నత విద్యలోని పీజీతోపాటు వివిధ ప్రొఫెషనల్ కోర్సుల్లోని ప్రవేశాల ప్రవేశపరీక్షలు అన్ని మే నెలలోనే జరగబోతున్నాయి. వాటి ఫలితాలు వచ్చేలోగా డిగ్రీ ఆరో సెమిస్టర్ పరీక్షలు పూరిచేసి ఫలితాలను సకాలంలో ఇస్తేనే బాగుంటుందనే అభిప్రాయం వ్యక్తం అవుతుంది.లేదంటే విద్యార్థులు ఇబ్బంది పడే అవకాశం లేకపోలేదు.